



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ ఎం.గౌతమి

ఓటు వజ్రాయుధం


నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమి పేర్కొన్నారు. గురువారం నాడు అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ ఎం.గౌతమి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, డిఆర్ఒ గాయత్రి దేవి, అనంతపురం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఈ సంవత్సరం జరగబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వినియోగించుకునేలా ఓటు హక్కును కల్పిస్తున్నామన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలన్నారు. ఈవీఎంల ఉపయోగంపై కూడా విస్తతంగా అవగాహన కల్పించామని తెలిపారు. ఎన్నికల రోజు ఖచ్చితంగా పోలింగ్ కేంద్రానికి వచ్చి నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఓటర్ స్లిప్పులను త్వరలో అందిస్తామని, ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఓటు వేయాలని కోరారు. నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును బాధ్యతగా ఉపయోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో తమకు నచ్చిన వారికి ఓటు వేసుకునే అవకాశం ఉంటుందన్నారు. డిఆర్ఒ గాయత్రీ దేవి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. అందరూ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం మొదటిసారి ఓటర్లుగా నమోదు చేసుకున్న విద్యార్థులకు ఎపిక్ కార్డులను కలెక్టర్ పంపిణీ చేశారు. ఓటర్ల జాబితా తయారీలో బాగా పనిచేసిన ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్లకు, సీనియర్ అసిస్టెంట్లకు మెమెంటోలను అందజేశారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. అంతకుముందు ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అవుతామని, ఓటు హక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు గ్రంధి వెంకటేష్, రాణిసుస్మిత, ఈఆర్ఒలు సుధారాణి, వెంకటేశ్వర్లు, వరప్రసాద్, కరుణకుమారి, వెంకటనారాయణమ్మ, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, తహసీల్దార్ లు బాలకిషన్, హరికుమార్, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, విద్యార్థులు పాల్గొన్నారు.

బిల్లులు.. వచ్చేలా లేవు..!

- చేసిన పనులకు చెల్లింపులు చేయండి మహాప్రభో..!
- ఎన్నికల్లో గట్టెక్కుతామని వేడుకోలు
- అధికారులు, ప్రభుత్వ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు
- ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి మొర



మంత్రులు, ఇతర ముఖ్య నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'ఎన్నికలొచ్చాయి.. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి... ఇస్తే ఎన్నికల సమయంలో ఖర్చులకైనా వస్తాయి... బిల్లులు చెల్లించండి మహా ప్రభో'.. అంటూ ముఖ్య ప్రజాప్రతినిధులే ఫైళ్లు పట్టుకుని ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరుగుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా పర్యటన వచ్చిన సందర్భంగానూ కొంత మంది ఎమ్మెల్యేలు బిల్లులివ్వమని అడగటం గమనార్హం. ఇప్పుడు రాకపోతే ఎన్నికల అనంతరం పరిస్థితి ఏ రకంగా ఉంటుందోనన్న గుబులు పనులు చేసిన నాయకుల్లో నెలకొంది. వైసిపి అధికారంలోకి వచ్చాక చాలా కాలం పనులు ముందుకు నడవలేదు. ప్రధానంగా 2019 ఎన్నికలకు ముందు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పనులు చేశారు. అయితే 2019 ఎన్నికల అనంతరం టిడిపి కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులను నిలిపివేసి ఉన్నారు. ఇప్పటికి వారి బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆ తరువాత వైసిపి ప్రభుత్వ హయాంలో రహదారులు, సచివాలయాలు, విలేజ్ క్లీనిక్‌లను, రైతు భరోసా కేంద్రాలు ఇలా వివిధ రకాల పనులను వైసిపి నాయకులు, కార్యకర్తలు చేశారు. రహదారులు వంటి పెద్ద పనులైతే నేరుగా ప్రజాప్రతినిధులే చేశారు. వీటి బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఒకటి, రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ కూడా రానుంది. నోటిఫికేషన్ వచ్చాక బిల్లులు చెల్లింపులు దాదాపుగా నిలిచిపోతాయి. ఆ తరవాత ప్రభుత్వంలో ఏదైనా మార్పులు, చేర్పులు జరిగితే బిల్లుల పరిస్థితి ఏమిటన్న గుబులు ఇప్పుడు వైసిపి నేతల్లో నెలకొంది. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు ఎమ్మెల్యేలపైనా ఒత్తిడి పెంచుతున్నారు. వెంటనే బిల్లులు మంజూరు చేయించాలని కోరుతున్నారు. దీంతో ఎమ్మెల్యేలే నేరుగా రంగంలోకి దిగుతున్నారు. బిల్లులు చెల్లించాలని అధికారులతోపాటు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పుట్టపర్తికి విచ్చేసిన సందర్భంగానూ ఇద్దరు ప్రజాప్రతినిధులు కలసి రూ.ఎనిమిది కోట్లు, రూ.50కోట్ల బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. అదే విధంగా మరో ఎమ్మెల్యే తాను కాంట్రాక్టు చేస్తున్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లుల కోసం తిరుగుతూనే ఉన్నారు. టిక్కెట్టు దక్కిని మరో ప్రజాప్రతినిధికి సంబంధించి కూడా బిల్లులు పెద్దఎత్తునే పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. మొత్తంగా వైసిపి నాయకులు, కార్యకర్తల్లో బిల్లుల గుబులు నెలకొంది. కోట్లు ఖర్చు పెట్టాం. ఇప్పుడు ఆ బిల్లులు రాకపోతే తరువాత పరిస్థితి ఏమిటన్న గుబులు వారిలో కనిపిస్తోంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు డబ్బులు వెనకేసుకుందామంటే ఈ రకంగా బుక్ అవుతున్నామోనని భయపడుతున్నారు. వీరి గుబులు చూసి ఎమ్మెల్యేల్లోనూ ఆందోళన నెలకొంది. కార్యకర్తలు తమను నమ్మి పనులు చేశారు. ఇప్పుడు రాకుండాపోతే వారు పూర్తిస్థాయిలో నష్టపోతే తరువాత వారిచేత ఎన్నికల్లో ఏ రకంగా పని చేయించుకోగలమని దిగులు చెందుతున్నారు.

రిపబ్లిక్ వేడుకలకు సర్వంసిద్ధం

ఏర్పాట్లను పరిశీలించిన జెసి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

జిల్లా కేంద్రలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించే గణతంత్ర దినోత్సవం వేడుకలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం అనంతపురం నగరంలోని పరేడ్ గ్రౌండ్లో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం కోసం అన్ని రకాల ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్టాల్స్, శకటాలు, సాంస్కతిక కార్యక్రమాలు, సీటింగ్ ఏర్పాటు, తాగునీటి సరఫరా తదితర అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, అడిషినల్ ఎస్పీ హనుమంతు, ఆర్డీవో జి.వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా టూరిజం అధికారి నాగేశ్వర రెడ్డి, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్ రావు, తహశీల్దార్ లు విజయలక్ష్మి, హరికుమార్, ఉషారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పయ్యావుల కేశవ్

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేద్దాం

- పిఎసి చైర్మన్ పయ్యావుల కేశవ్
- ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-ఉరవకొండ

ఈనెల 27వ తేదీన ఉరవకొండలో టిడిపి అధినేత, మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేసేలా టిడిపి శ్రేణులు పని చేయాలని ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. చంద్రబాబు పర్యటనకు సంబంధించి ఉరవకొండ పట్టణంలోని అనంతపురం బైపాస్ రోడ్డు భారత్ పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాట్లను టిడిపి నాయకులతో కలిసి పరిశీలించారు. సభాస్థలితోపాటు హెలిప్యాడ్ పనులను ప్రత్యక్షంగా పాల్గొని పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పార్లమెంట్ పరిధిలో లక్ష మందితో రా కదలిరా అనే కార్యక్రమాన్ని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు తెలిపారు. రా కదిలిరా కార్యక్రమం పార్టీ శ్రేణులకు నూతనోత్తేజాన్ని ఇస్తోందన్నారు. అన్ని గ్రామాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఉరవకొండలో జరిగే రాకదిలిరా కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దముష్టూరు సర్పంచి బోస్, ఇంద్రావతి మాజీ సర్పంచి వెంకటేశులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

డ్వాక్రా పొదుపు రుణం స్వాహా

- ఎస్‌బిఐ సేవాకేంద్రం నిర్వాహకుని చేతివాటం
- రాయదుర్గంలో మహిళల సొమ్ముతో పరారీ

ప్రజాశక్తి-రాయదుర్గం

ఎస్‌బిఐ సేవా కేంద్రం నిర్వాహకుడు పొదుపు మహిళా సంఘం సభ్యుల డబ్బును కాజేసి పరారయ్యాడు. బ్యాంకు అనుబంధ కేంద్రం కావడంతో నిర్వాహకుడిని నమ్మిన మహిళలను అతను నట్టేట ముంచాడు. లక్షలాది రూపాయలతో ఆయన పరారు కావడంతో మహిళలు లబోదిబోమంటులున్నారు. రాయదుర్గం పట్టణంలో గురువారం వెలుగు చూసిన ఈ ఘటన తీవ్ర సంచలనం రేపింది. ఇందుకు సంబంధించిన బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... రాయదుర్గం పట్టణంలోని లక్ష్మీ బజార్ రామస్వామి వీధిలో భారతీయ స్టేట్ బ్యాంక్‌కు అనుబంధంగా వినియోగదారుల సేవా కేంద్రం ఉంది. దీనిని పట్టణానికి చెందిన కౌలేష్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడు. ఖాతాదారులతో వేలిముద్రలు తీసుకోవడం, వారికి డబ్బులు ఇవ్వడం చేస్తుంటాడు. ఇందులో భాగంగా రాయదుర్గం పట్టణం నేసేపేట చౌడమ్మగుడి వీధికి చెందిన పి.మీనాకు కనేకల్ రోడ్‌లోని భారతీయ స్టేట్‌బ్యాంక్‌లో జీరో సేవింగ్స్ అకౌంట్ ఉంది. ఇటీవల ఆమెకు లక్ష రూపాయల డ్వాక్రా పొదుపు రుణం మంజూరు అయ్యింది. ఈ మొత్తం ఆమె ఎస్‌బిఐ ఖాతాలోకి జమ అయ్యింది. తన ఖాతా ఉన్న బ్యాంకులో జనం రద్దీగా ఉండడంతో డబ్బును విత్‌డ్రా చేసుకోవడం కష్టం అయ్యింది. దీంతో ఈనెల 5వ తేదీన కనేకల్ రోడ్డు రామస్వామి వీధిలో ఉన్న స్టేట్ బ్యాంక్ వినియోగదారుల సేవ కేంద్రంకు వెళ్లింది. కేంద్రం నిర్వాహకుడు కౌలేష్ ఆమె నుంచి ఆధార్ వేలిముద్రను నాలుగు సార్లు వేయించుకున్నాడు. అనంతరం సర్వర్ పని చేయడం లేదని, ఒక రోజు తర్వాత రావాలని చెప్పాడు. 6వ తేదీన మహిళ మళ్లీ కేంద్రానికి వెళ్లింది. ఆ రోజు కూడా అతను మరోసారి వేలిముద్ర వేయించుకున్నాడు. అప్పుడు కూడా సర్వర్ పని చేయలేదని చెప్పి ఆమెను అక్కడి నుంచి పంపారు. డబ్బులు అవసరం కావడంతో మీనా ఆమె భర్త ఉమాపతిలు వారి ఖాతా ఉన్న ప్రధాన స్టేట్ బ్యాంకు కార్యాలయానికి వెళ్లారు. అక్కడ వీరి ఖాతాను పరిశీలించిన బ్యాంకు అధికారులు వేలిముద్ర ద్వారా రూ.90వేలు విత్‌డ్రా అయ్యిందని చెప్పారు. దీంతో ఖంగుతిన్న భార్యాభర్తలు ఇద్దరూ స్టేట్‌బ్యాంకు సేవా కేంద్రం వద్దకు వెళ్లారు. అక్కడ ఆ కేంద్రానికి తలుపులు వేసి ఉంది. నిర్వాహకుడు కౌలేష్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో వారు బ్యాంకు అధికారులను ఆశ్రయించి వారికి జరిగిన అన్యాయాన్ని సిబ్బందికి వివరించారు. బ్యాంకు మేనేజర్ సూచన మేరకు పోలీసులకూ ఫిర్యాదు చేసింది. ఈ ఘటన జరిగి 20 రోజులు అవుతున్నా దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి పురోగతీ కన్పించలేదని బాధితులు విలేకరుల వద్ద వాపోయారు.

12 మంది ఖాతాదారుల సొమ్ము స్వాహా

ఈ విషయమై ప్రధాన స్టేట్ బ్యాంక్ మేనేజర్ మత్యుంజయ మాట్లాడుతూ స్టేట్ బ్యాంకు సేవా కేంద్రం నిర్వాహకుడు కౌలేష్ 12 మంది ఖాతాదారుల నుంచి డబ్బులు తీసుకుని మోసం చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే బ్యాంకు ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. కౌలేష్‌కు చెందిన వినియోగదారుల సేవాకేంద్రం సేవలను నిలిపేశామన్నారు. పోలీసులకు కూడా దీనిపై ఫిర్యాదు చేశామని తెలియజేశారు.

గతంలోనూ ఎస్‌బిఐలో ఇలాంటి ఘటన

గతంలో రాయదుర్గం స్టేట్ బ్యాంకులో పనిచేసిన మేనేజర్ ఖాతాదారులకు సంబంధించిన మొత్తాలను తన ఖాతాల్లోకి బదిలీ చేసుకున్న ఘటన తీవ్ర సంచలనం రేపింది. మోసం చేసిన బ్యాంకు మేనేజర్‌పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, ఆయన్ను అరెస్టు చేశారు. అది మరువక ముందే మళ్లీ అదే బ్యాంకు పరిధిలో మరో మోసం జరగడం ఖాతాదారులను తీవ్ర విస్మయానికి గురి చేస్తోంది.

ఆర్డీటీ గృహప్రవేశాలు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు



ఇళ్లకు పూజలు చేస్తున్న స్పెయిన్ బృందం

మండల కేంద్రం లోని ఆర్డీటీ కాలనీలో నిర్మించిన 44 ఇళ్లను స్పెయిన్ దేశస్తులు, ఆర్డీటీ సిబ్బంది గురువారం ప్రారంభించారు. ముందుగా స్పెయిన్ బృందం అశ్వర్థంలోని అశ్వర్థ నారాయణస్వామిని దర్శించుకున్నారు. అనంతరం కాలనీకి వచ్చి ఇళ్లను ప్రారంభించారు. ముందుగా ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఆర్‌డి లక్ష్మణ్‌రావు, తాడిపత్రి ఏరియా టీమ్ లీడర్ రామాంజనేయులు, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు టి.ఆదినారాయణమాదిగ, ఆర్డీటీ సిఇఒలు ఓబులేసు, ఆంజనేయులు, నాగప్ప, చంద్ర, శ్రీనివాసులు, పార్వతి, తిరుపతమ్మ, ఆదినారాయణ, పెద్దపప్పూరు గ్రామ సిడిసి మహిళా పొదుపు సంఘం లీడర్లు నీలావతి, ఈరన్న, శ్రీరాములు, భార్గవ్, శివ, ఏసుదాసు, మహిళా సంఘం సభ్యులు లక్ష్మీదేవి, రామసుబ్బమ్మ, భాగ్యమ్మ, రామలక్ష్మి, నాగేశ్వరి, రాజమ్మ, నల్లక్క, సుందరమ్మ, నారాయణమ్మ, జయరాములు, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర

ప్రజాశక్తి-గుంతకల్లు

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పట్టణంలోని భగత్‌సింగ్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఎదుట నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే యుటిఎఫ్ ఆధ్వర్యంలో అనేకమార్లు ఆందోళనలు చేశామన్నారు. ఇందులో భాగంగానే డిసెంబర్ 30న రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహిస్తే స్పందించిన విద్యాశాఖ అధికారులు యుటిఎఫ్ రాష్ట్ర నాయకులను చర్చలకు పిలిచి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయినా పరిష్కరించిన పాపానపోలేదన్నారు. ఈనేపథ్యంలో ఈనెల 25న విజయవాడలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అయితే రాష్ట్ర కేంద్రంలో భద్రతా సమస్య వస్తుందనే కారణంతో అనుమతి ఇవ్వకుండా ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పట్టణ గౌరవాధ్యక్షులు మల్లికార్జున, ఉపాధ్యక్షులు రమేష్, కోశాధికారి యల్లన్న, రూరల్ ప్రధాన కార్యదర్శి కల్పన, పట్టణ కార్యదర్శులు సుధాకర్, వెంకటేష్, తిమ్మారెడ్డి, విశ్వేశ్వరబాబు, రామ్మోహన్, రమేష్, చలపతి, పెన్నయ్య, పెద్దయ్య, గురునాథ్, భాస్కర్, నామేనాయక్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల



కరపత్రాలను అందజేస్తున్న నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం మండలంలోని నిదనవాడ గ్రామంలో 'బాబు షూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు సిఎం అయితే రాష్ట్రంలో మహిళలకు సంక్షేమ పథకాల పండుగే అన్నారు. ముఖ్యంగా మహాశక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500, తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికీ రూ.15,000 వంటి పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపిని ఆదరించి చంద్రబాబును సిఎంను చేసుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు లాయర్ ఈశ్వర్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, మాజీ మండల కన్వీనర్ చితంబరి దొర, మాజీ జడ్పిటిసి అమ్మలదిన్నె శాలిని, సర్పంచి రమేష్, సింగారయ్య, సత్యనారాయణ, సురేంద్రయాదవ్, గుర్రం లక్ష్మీనారాయణ, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంసిఎ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న జెఎన్‌టియు అధికారులు

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో నిర్వహించిన ఎంసిఎ 2వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్ పరీక్ష ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ తెలిపారు. ఫలితాల కోసం కళాశాల అకాడమిక్ సెక్షన్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఇ.అరుణకాంతి, డిప్యూటీ కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్స్ డి.విష్ణువర్ధన్, డి.లలితకుమారి, వివిధ విభాగాల అధిపతులు కె.ఎఫ్.భారతి, ఎం.రామశేఖరరెడ్డి, కె.కళ్యాణిరాధ, దిలీప్‌కుమార్, జి.మమత, అజిత, తదితరులు పాల్గొన్నారు.

నేడు సంత్‌సేవాలాల్ శాంతి సద్భావన రథయాత్ర

సేవాఘడ్ ట్రస్టు, ఎఐబిఎస్ఎస్ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

బంజారాల ఆరాధ్యదైవం మాతా జగదాంబ, సంత్ శ్రీసంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అనంతపురంలో శాంతి సద్భావన రథయాత్ర నిర్వహించనున్నట్లు టిటిడి బోర్డు సభ్యులు, సేవాఘడ్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి సి.అశ్వర్థనాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీనాయక్, పి.బాబునాయక్ తెలిపారు. గురువారం నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో రథయాత్రకు సంబంధించిన గోడపత్రాలు, కరపత్రాలు, బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జన్మస్థలం సేవాఘడ్‌లో ఫిబ్రవరి 13, 14, 15 తేదీల్లో సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు ఆహ్వానం పలుకుతూ శాంతి సద్భావన రథయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక బంజారా భవన్ నుంచి టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, విద్యుత్ నగర్ సర్కిల్ మీదుగా ఆదర్శ నగర్‌లోని మారెమ్మతల్లి ఆలయాన్ని సందర్శించి నాయక్ నగర్‌లోని మరియామా యాడి ఆలయం వరకూ సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సేవాఘడ్ ట్రస్టు కోశాధికారి బాలానాయక్, ఉపాధ్యక్షులు బిఆర్.రంగ్లా నాయక్, ఏఐబిఎస్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్ నాయక్, రామాంజనేయులు నాయక్, ప్రసాద్ నాయక్, నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సేవాఘడ్ ట్రస్టు, ఎఐబిఎస్ఎస్ నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com



లైబ్రరీని ప్రారంభిస్తున్న అతిథులు

'పుస్తక మిత్ర' ప్రారంభం

పుట్లూరు : మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఎన్ఆర్ఐ వాసవీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పుస్తక మిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్ఆర్ఐ వాసవీ అసోసియేషన్ ద్వారా దేశవ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇందులో భాగంగానే పుట్లూరు, కడవకల్లులో విద్యార్థుల సౌకర్యార్థం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎన్ఆర్ఐ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు పండిరి తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ వారికి భూమిరెడ్డి నాగార్జునరెడ్డి రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో శింగనమల మార్కెట్ యార్డు ఛైర్మన్ భూమిరెడ్డి సునీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బిఎల్ఒగా పవన్‌కుమార్

రాయదుర్గం : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాయదుర్గం నియోజకవర్గం స్థాయిలో బిఎల్ఒ(పోలింగ్ బూత్ స్థాయి అధికారి)గా విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన బోయ పవన్‌కుమార్ గవర్నర్ ఎస్. అబ్దుల్‌నజీర్ నుంచి అవార్డు అందుకున్నారు. బోయ పవన్‌కుమార్ రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలోని 15వ సచివాలయం లో వార్డు సౌకర్యాల కల్పన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. గవర్నర్ నుంచి ఉత్తమ బిఎల్ఒగా అవార్డ్ అందుకున్న పవన్‌కుమార్‌కు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు అనుబంధ తైల సాంకేతిక, పరిశోధన సంస్థలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య బి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆవిర్భవించిన 1950 జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటు హక్కు విశిష్టత తెలుసుకుని అర్హులైన వయోజనులందరూ ఓటుహక్కు ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సి.గోపీనాథ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జిఎస్.శంకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.శైలజ, ఉపాధ్యాయ బృందం, అధ్యాపకేతర సిబ్బంది, పొరుగు సేవల సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓటు వినియోగంపై రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గురువారం గుత్తిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి రెవెన్యూ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు కలిసి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దార్ లలిత, సిఎస్‌డిటి కె.సూర్యనారాయణ, ఆర్ఐ సందీప్, వీఆర్వోలు, శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సి.వెంకటేశ్వర్లరెడ్డి అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సునీతాబాయి, సిఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఆర్ డిగ్రీ కళాశాల, చైతన్య స్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీగా అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకుని మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్.ఐ.క్రాంతికుమార్, వీఆర్వో వెంకటరాముడు, వైసిపి నాయకులు మధుసూదనరెడ్డి, వైసిపి పట్టణ కన్వీనర్ జోజోడ్ కుమార్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండలంలోని జూటూరు గ్రామంలో ఉన్న జెసి దివాకర్‌రెడ్డి అగ్రికల్చర్ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కులపై గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎసిఐ శరత్‌చంద్ర ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే త్వరలో రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ విధిగా ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జెఎన్‌టియు అధ్యాపకులు, విద్యార్థులు

పెద్దవడుగూరు : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని రెవెన్యూ అధికారులు గురువారం ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగభూషణ, ఉప తహశీల్దార్ వెంకటేశ్వర్లమ్మ, సీనియర్ సహాయకులు వెంకటరాముడు, సర్వే తహశీల్దార్ జయమ్మ, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

అనంతపురం : ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఓటు హక్కులపై గురువారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ నగరూరు రసూల్ ఆధ్వర్యంలో 'నథింగ్ లైక్ ఓటింగ్ ఐ ఓట్ ఫర్ ష్యూర్' అంటూ నినదించారు. అనంతరం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సాంబ, ముని, జ్ఞానేష్, శివ, నారాయణస్వామి, సల్లావుద్దీన్, సూర్య, కల్పన, శిరీష, ధరాక్, ధరణి, ప్రవీణ్, రేణుక, ధరణి, శిరీష, మాబ్జాన్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా గురువారం అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వై.మధుసూదన్‌రెడ్డి జాతీయ ఓటరు దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, నాగరాణి, రవి, ఎస్వీ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మురళీధర్‌రావు, ఆదినారాయణ, ఎంఎన్ఎస్ ఆఫీసర్ జి.ఆనంద్‌బాబు, ఎస్.పురుషోత్తం, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు



పామిడిలో ఏర్పాటు చేసిన మానవహారంలో మాట్లాడుతున్న వక్తలు

'రా కదలిరా'ను జయప్రదం చేయండి

ఉరవకొండ : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఈనెల 27వ ఉరవకొండలో నిర్వహించనున్న రా కదిలి రా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతమ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఉరవకొండలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని జనసేన నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న నిర్వహించనున్న రా కదలి రా కార్యక్రమానికి ఐదు మండలాల నుంచి నియోజకవ్యాప్తంగా జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రశేఖర్, సుధీర్, అచనాల కేశవ, గోపాల్, దేవేంద్ర, రమేష్, తిలక్, మల్లికార్జున, మల్లేష్‌గౌడ్, మణికుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెలుగుప్ప : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఈనెల 27వ ఉరవకొండలో నిర్వహించనున్న రా కదిలి రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి సీనియర్ నాయకులు తగ్గుపర్తి రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శి మల్లికార్జున పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రా కదిలిరా కార్యక్రమంలో భాగంగా వైసిపి అరాచక పాలనపై చంద్రబాబు ప్రజలకు వివరించి చైతన్యపరచనున్నట్లు తెలిపారు. కావున పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కదిలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వైస్ఎంపిపి దుద్దేకుంట తిమ్మప్ప, తిప్పయ్య, త్రివేదినాయుడు, వీరాంజనేయులు, ఆవులెన్న సర్పంచు రామ్మోహన్ చౌదరి, ఇరుపాపల్లి మాజీ సర్పంచి రాధాకృష్ణ, నరిగన్న, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపిపి దాసరి సునీత అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి ఆసుపత్రి అభివృద్ధి సమావేశం నిర్వహించి ఆసుపత్రికి కావాల్సిన అవసరాలను తీర్చేందుకు తీర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆసుపత్రికి ఇన్వర్టర్, బ్యాటరీ కోసం తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పసులూరు సర్పంచి కల్పలతారెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మన్నేరు కొండమ్మ, వైద్యాధికారిణి స్వాతిలక్ష్మి, డాక్టర్ తహీరున్నీసా, సిహెచ్ఒ మోహన్‌రావు, పిహెచ్ఎన్ చెన్నమ్మ, హనుమంతురెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీనియర్ అసిస్టెంట్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

అశ్వర్థ నారాయణస్వామి కళ్యాణం

పెద్దపప్పూరు : మండలం కేంద్రం సమీపంలో వెలసిన అశ్వర్థ నారాయణస్వామి, భీమలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం గురువారం కన్నుల పండువగా సాగింది. ప్రతి పున్నమికీ స్వామివారి కళ్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని కళ్యాణం నిర్వహించడంతోపాటు గ్రామోత్సవం నిర్వహించారు. అంతకుముందు కుంకుమార్చన, అభిషేకం, తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, ఇఒ సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

పంటలను నమోదు చేసుకోండి : ఎఒ

శింగనమల : మండల వ్యాప్తంగా రైతులు సాగు చేసిన పంటల విక్రయానికి ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎఒ అన్వేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం కందులు (క్వింటాల్లో) రూ.9,730, పత్తి 7,020, జొన్నలు 3,225 మద్దతు ధరను నిర్ణయించినట్లు తెలిపారు. కావున ఆయా పంటలు సాగు చేసిన రైతులు ముందుగానే ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

సిద్ధరాంపురం సర్పంచి మృతి తీరనిలోటు

ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలోని సిద్ధరాంపురం గ్రామ పంచాయతీ సర్పంచు జి.కొండన్న (49) మృతి పార్టీకి తీరని లోటని ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. అనారోగ్యంతో కొంతకాలంగా బాధపడుతున్న కొండన్న బెంగళూరులోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. విషయం తెలుసుకున్న సాంబశివారెడ్డి, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, తదితరులు గ్రామానికి చేరుకుని సర్పంచి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గువ్వల రాజశేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నీలం భాస్కర్, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సర్పంచుకు నివాళులర్పిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

పోలింగ్ కేంద్రాల తనిఖీ



అధికారుతో మాట్లాడుతున్న జెసి కేతన్‌గార్గ్

బెలుగుప్ప : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తనిఖీ గురువారం ఆకస్మికంగా చేశారు. ఇందులో భాగంగా కాలువపల్లి, దిద్దేకుంట, కోనంపల్లి, జీడిపల్లి, అంకపల్లి, రామసాగరం, తగ్గుపర్తి, బెలుగుప్ప, బెలుగుప్ప తండా, యర్రగుడి, ఆవులెన్న, వెంకటాద్రి, శిర్పి, హనుమిరెడ్డిపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి స్థానిక అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఓబులేసు, ఏవో పృథ్వీసాగర్, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, ఎస్ఐ శివ, బిఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి తక్షణ సాయం

రాయదుర్గం : పట్టణంలోని బళ్లారి రోడ్డులో జరిగిన ప్రమాదంలో స్థానిక దండు బసప్ప వీధిలో నివసిస్తున్న కె.అజయ్ మృతి చెందాడు. వైఎస్ఆర్ బీమా పథకంలో ద్వారా 1వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి భీమనపల్లి దివాకర్ గురువారం అజయ్ భార్య సరస్వతికి తక్షణ సాయం రూ. 10వేలు అందజేశారు. మిగిలిన రూ. 4.9 లక్షలు త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమం లో వైసిపి నాయకులు పొరాలు శివ, రామాంజనేయులు, సచివాలయ సెక్రటరీ శివమూర్తి, వాలంటీర్ నిస్సార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ

గుత్తి : 10వ తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్స్ (పుస్తకాలు)ను సాంఘిక సంక్షేమ సహాయ అధికారి బి.రాధిక గురువారం అందజేశారు. ఆమె సొంత డబ్బుతో కొనుగోలు చేసిన మోడల్ పేపర్స్ డివిజన్ పరిధిలోని 10 సంక్షేమ వసతి గహాల్లో చదువుతున్న దాదాపు 100 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఒ మహబూబ్‌బాషా, ఎల్ డిసి రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రవ్యాప్తంగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉరవకొండ తాలూకా పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కిష్టప్ప, కార్యదర్శి వెంకటస్వామి, సంయుక్త కార్యదర్శి బుక్కిట్ల కృష్ణమూర్తి, కోశాధికారి నారాయణ, జిల్లా అబ్జర్వర్లు బి.కిష్టప్ప, కె.వేణుగోపాల్, విశ్రాంత ఉపాధ్యాయులు తమ్మన్న డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ప్రదర్శనగా వచ్చి నిరసన వ్యక్తం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేకమార్లు ఆందోళనలు చేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్లు బి.గురుస్వామి, గోవిందప్ప, ఎం.చెన్నకేశవులు, రంగరాజు, జి.దత్తాత్రేయ, పి.నబీసాబ్, పాటిల్ కోటేశ్వర్‌గౌడ్, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో గుత్తిలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షుడు కె.అబుబకర్ మాట్లాడుతూ 11వ పిఆర్సిలో ప్రభుత్వం తగ్గించిన అదనపు పెన్షన్ యథాతథంగా పునరుద్ధరించాలన్నారు. పెండింగ్ డిఎ బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. 11వ పిఆర్‌సి అరియర్స్‌ను చెల్లించాలన్నారు. హెల్త్ కార్డులతో గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో అన్ని వ్యాధులకు వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల ఉపాధ్యక్షురాలు ఎం.స్వర్ణాంబ, కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : హెల్త్ అలవెన్స్ రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం పట్టణంలో ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. పెన్షనర్ల కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టి కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం ఇచ్చారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం వేతన సవరణ, కరువు బత్యం బకాయిలు చెల్లించలేదని, మధ్యంతర భతి ఇవ్వలేదన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించకపోతే దశల వారీగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీరికి మద్దతుగా ఎపి ఎన్జీవోల సంఘం జోనల్ అధ్యక్షులు డాక్టర్ కెంచె లక్ష్మీనారాయణ ధర్నాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తాలూకా సంఘం అధ్యక్షులు ఈ.రామాంజనేయులు, పెన్షనర్లు పాల్గొన్నారు.



ఉరవకొండలో ఆందోళన చేస్తున్న పెన్షనర్లు

ప్రగతి మిల్లెట్ యూనిట్ ప్రారంభం

గుత్తి : విజయనగర పట్టణ మహిళా సమైక్య, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో గుత్తిలో ఏర్పాటు చేసిన మహిళా పట్టణ ప్రగతి మిల్లెట్ యూనిట్‌ను మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, కమిషనర్ జి.శ్రీనివాసులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిల్లెట్ యూనిట్ ద్వారా మహిళలు ఉపాధి రంగంలో వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో ఉన్న మహిళా సంఘ సభ్యురాలు టీఎం హేమావతి పెట్టుబడి నిధి రూ.1.10 లక్షలతో మిల్లెట్ యూనిట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారిణి కెరెన్, సుమనదుర్గ, సురేఖ, కౌన్సిలర్ ఫారూఖ్, వైసిపి నాయకులు ఎం. రంగస్వామి, సునీల్, అబ్దుల్, మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.



మిల్లెట్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు కేసేపల్లి విద్యార్థిని

నార్పల : మండల పరిధిలోని కేసేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన లిఖిత ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్‌నకు ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు శాంత ప్రకాశ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లిఖితతోపాటు మరో ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

అనధికార గ్యాస్‌సిలిండర్ల వాడకంపై తనిఖీలు

అనంతపురం : అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎం.మునిరామయ్య ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. బుక్కరాయసముద్రం మండలం వడియంపేట గ్రామంలో ఉన్న రెడ్డెమ్మ హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా నిబంధనలను ఉల్లంఘించి వాడుతున్న ఆరు డొమెస్టిక్ సిలిండర్లను జప్తు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పి.ఫణీంద్రనాథ్‌రెడ్డి, వాసుప్రకాష్, రెవెన్యూ అధికారిణి కె.శిరీషా, అధికారులు పాల్గొన్నారు.

విశిష్ట సేవలకు జ్ఞాపికల ప్రదానం

రాయదుర్గం : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ వి.సుజాతదేవి, కంప్యూటర్ ఆపరేటర్ టి.రెహ్మాన్ గురువారం జిల్లా కలెక్టర్ గౌతమి నుంచి జ్ఞాపికలు అందుకున్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో విశిష్ట సేవలు అందించినందుకు ఓటర్ల దినోత్సవం సందర్భంగా అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో వారికి జిల్లా కలెక్టర్ జ్ఞాపికలు అందజేశారు.

బీఎస్పీ కార్యాలయం ప్రారంభం

రాయదుర్గం : పట్టణంలోని భంభం స్వామి లేఔట్‌లో గురువారం బహుజన సమాజ్ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి చిందనూరు నాగరాజు ప్రారంభించారు. ఆయన మాట్లా డుతూ పట్టణంలోని తేరువీధిలో శుక్రవారం బహుజన రాజ్యాధికార సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కోఆర్డినేటర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొంటారని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కామాఖ్యదేవిని దర్శించుకున్న విప్ కాపు దంపతులు

రాయదుర్గం : రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, ఆయన భార్య ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి గురువారం అస్సోంలోని గౌహతి సమీపంలో వెలసిన ప్రముఖశక్తి పీఠం కామాఖ్యదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

బిఎన్.హళ్లిలో ఎన్ఎస్ఎస్ శిబిరం

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్(జాతీయ సేవా విభాగం) యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ నాగప్ప ఆధ్వర్యంలో గురువారం మండలంలోని బిఎన్ హళ్లి గ్రామంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రఘురామ్మూర్తి మాట్లాడుతూ ఏడు రోజుల కార్యక్రమం లో భాగంగా పరిశుభ్రత-పచ్చదనం, వ్యాధుల నివారణ, గ్లోబల్ వార్మింగ్, ఓటు హక్కు వినియోగం, మూఢ నమ్మకాలు, తదతర అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శోభ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, రామకృష్ణ, వాలంటీర్లు పాల్గొన్నారు. కళాశాలలో నేషనల్ ఓటర్స్ డే నిర్వహించారు. ఎఎస్ఐ భాస్కర్ విద్యార్థుల చేత ఓటు హక్కు వినియోగం ప్రాధాన్యతకు సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు.


ఉచిత వైద్యశిబిరం

గుత్తి : పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న కనిష్క హెల్త్ కేర్ సెంటర్ సహకారంతో సీఐ ఎం.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా డాక్టర్ కృష్ణప్రసాద్, మార్క్ హార్ట్ ఇన్స్టిట్యూట్ కార్డియాలజిస్ట్ నాగరాజు, సిబ్బంది పోలీసులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం పట్టణ, గ్రామీణ ప్రాంతవాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

ఈక్రాప్ నమోదు పరిశీలన

ఉరవకొండ : రబీ సీజన్‌లో రైతు భరోసా సిబ్బంది చేసిన ఈక్రాప్ నమోదును విడపన కల్లు మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా గ్రామంలో రైతు కంద్యాల నారాయణకు చెంది న సర్వే నెంబర్ 209లో 1.59 ఎకరాలతో పాటు, బొజ్జప్ప సర్వే నెంబర్ 380లో మూడెక రాల్లో సాగుచేసిన పప్పుసెనగ పంటను పరిశీ లించారు. అలాగే కరణం భార్గవి సర్వేనెంబర్ 373ఏ 11.55 ఎకరాల్లో సాగుచేసిన కుసుమల పంటను పరిశీలించారు. ఇదేవిధంగా మండల వ్యాప్తంగా రవి సీజన్‌లో సాగు చేసిన ఈక్రాప్ నమోదుపై సూపర్ చెక్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎఎ లక్ష్మణ్, రైతులు మహానంది, బొజ్జప్ప పాల్గొన్నారు.

సినీ హీరో సుమన్‌ను కలిసిన నాయకులు



సుమన్‌కు గుత్తికోట ఫొటోను అందజేస్తున్న నాయకులు

గుత్తి : సినీ నటుడు సుమన్‌ను గుత్తి కోట పరిరక్షణ కమిటీ నాయకులు గురువారం కలిశారు. పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ హోటల్లో గుత్తి కోట పరిరక్షణ కమిటీ నాయకులు బి.ఇస్మాయిల్, విరుపాక్షి రెడ్డి తదితరులు సుమన్‌ను కలిసి గుత్తి కోట ప్రాముఖ్యతను వివరించారు. గుత్తి కోటలో అద్భుత కట్టడాలు అనేకం ఉన్నాయని చెప్పారు. ముఖ్యంగా సినిమా షూటింగులకు అనువైన ప్రదేశమన్నారు. గతంలో క్షత్రియ అనే సినిమా గుత్తికోటలో తీశారని గుర్తు చేశారు. సినిమాలు తీసి కోట చరిత్ర బాహ్య ప్రపంచానికి పరిచయం చేయడానికి సహకరించాలని వారు కోరారు. దీనికి హీరో సుమన్ సానుకూలంగా స్పందించారని చెప్పారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

పెద్దవడుగూరు : మండలంలోని బందార్లపల్లిలో మద్దారామచంద్ర (38) గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామ సమీపంలోని పొలాల్లో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారి వచ్చి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామస్తులపై నక్క దాడి - 8మందికి గాయాలు

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని బొమ్మకపల్లి గ్రామంలో గురువారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన వారిపై ముళ్లపొదల్లో దాగి ఉన్న నక్క దాడి చేసి 8 మందిని గాయపరిచింది. భయాందోళనలకు గురైన బాధితులు నక్కను చంపేశారు. గాయపడ్డవారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. బుధవారం రాత్రి బొమ్మకపల్లిలో ఉరుదేవర నిర్వహించారు. ఇళ్లల్లో మాంసాహార వంటకాలు చేయడంతో ఆ వాసనతో నక్క గ్రామ పరిసరాల్లోకి వచ్చి ఉంటుందని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాజు తెలిపారు.